# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# పొరుగుకు నీటికోట తాళాలు

**తలాపున** పారుతున్న గోదారిగంగను కొండలెక్కించుకున్నం. సాగు నీటికి, తాగునీటికి ఢోకా లేకుండా వరుస ఎత్తిపోతలతో నీటికి నడకలు నేర్పినం. నీరు పారింది. తెలంగాణ సాగు బాగుపడింది. నెర్రెలుబారిన నేల దేశానికే అన్నపూర్ణగా ఎదిగింది. ఇదంతా కేసీఆర్ సాధించిన విజయ గాథ. కానీ, ఇప్పుడు మన నీటికోట తాళాలను తెలంగాణ విరోధుల చేతికిస్తున్నారు. గోదారిని చెరబట్టేందుకు పొరుగు సీఎం చంద్రబాబు, దూరాలకు తరలించుకుపోయేందుకు ప్రధాని మోదీ ఎత్తులు వేస్తున్నారు. గోదారిని కొల్లగొట్టి, తెలంగాణను ఎండబెట్టే దారుణానికి ఒడిగడుతున్నారు. చంద్రబాబు పోలవరం రిజర్వాయర్‌ను విస్తరించి బొల్లపల్లి రిజర్వాయర్‌కు అటునుంచి బనకచర్లకు నీటిని మళ్లించేందుకు పావులు కదుపుతున్నారు. 200 టీఎంసీలకుపైగా నీటిని ఎగరేసుకుపోయే పన్నాగమిది. జాతీయ ప్రాజెక్టుగా చెప్పుకొనే పోలవరంలో కేంద్రం అనుమతి లేకుండానే మార్పులుచేర్పులు చేయాలంటే సాధ్యమా? అంటే ఢిల్లీ మిలాఖతు కూడా ఇందులో ఉందని స్పష్టంగా అర్థమవుతున్నది.

దరఖాస్తులు లేవు, అనుమతులూ లేవు. కానీ, పోలవరం-బనకచర్ల లింకుకు కేంద్రం రూ.3 వేల కోట్లు ఇస్తానని చెప్పడమే అందుకు తార్కాణం. చంద్రబాబు అధికారంలోకి రాగానే బనకచర్లను ఎత్తుకోవడం, అదేవిధంగా తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడిన కొత్తలోనే ఇదే అదనుగా గోదావరి-కావేరి అనుసంధానం ప్రతిపాదనను కేంద్రం బయటకు తేవడం కాకతాళీయం ఏమీ కాదు. పోలవరాన్ని పరుగులు పెట్టించడానికి ఏకంగా ప్రధాని రంగంలోకి దిగడం గమనార్హం. గోదారి జలాలు తెలంగాణకు దక్కకుండా ఎగరేసుకుపోయి ఎక్కడెక్కడో జల సంతర్పణ చేస్తామనటం విడ్డూరం. ఏపీ, కేంద్రం ఈ విషయంలో తోడు దొంగల్లా వ్యవహరిస్తున్నాయనేది నూటికి నూరుపాళ్ల వాస్తవం.

ఇలా రెండువైపుల నుంచి జరుగుతున్న దాడి వల్ల తెలంగాణ ప్రయోజనాలు గోదారిలో మునిగిపోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ జలదోపిడీకి సీఎం రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండింతలుగా వంతపాడుతున్నది. ఒకటి, తెలంగాణ గోదారి జలాల హక్కులను కాపాడటంలో నిర్లిప్తంగా ఉండిపోవడం. రెండు, తెలంగాణ గోదారి జలాలు గరిష్ఠంగా వినియోగించుకునేందుకు మహత్తరమైన వ్యవస్థను కలిగిన కాళేశ్వరాన్ని కేవలం మేడిగడ్డలోని ఒక్క పిల్లర్ కుంగిపోయిందనే సాకుతో కాటగలపడం. మన ప్రాజెక్టులను మనమే నిర్వీర్యం చేసుకొని పొరుగువారి, ఇంకా అవతల ఉన్నవారి ప్రాజెక్టులు నింపేందుకు నీటిని వదిలేయడం మన కన్నును మనమే పొడుచుకోవడం తప్ప మరొకటి కాదు. పొరుగు రాష్ట్రం, కేంద్రం అడుగడుగునా కాళ్లల్లో కట్టెలు పెట్టినా తెలంగాణ నీటిహక్కును కాపాడేందుకు కేసీఆర్ తెగించి కొట్లాడారు. కాళేశ్వరం వంటి అద్భుతమైన, అద్వితీయమైన ప్రాజెక్టును కట్టారు. కానీ, ఇప్పుడు అదంతా గోదారిలో కలిపి పొరుగు జలదోపిడీకి గేట్లు ఎత్తేందుకు సిద్ధమయ్యారు కాంగ్రెస్ పాలకులు. పైనుంచి మహారాష్ట్ర ప్రాజెక్టుల వల్ల గోదారి నీళ్లు మనకు ఎటూరావు. దిగువన వస్తాయన్న చోట కట్టిన ప్రాజెక్టును చేజేతులా చంపి పొరుగు వారికి తోడుపడాలని తహతహలాడుతున్నారు. మరి తెలంగాణ ప్రజానీకం, ముఖ్యంగా రైతాంగం ఏం కావాలి? అనేది ప్రశ్న.

# ఐటీలో కేటీఆర్‌కు అదే క్రేజ్

**తమ్ముడు ముఖ్యమంత్రిగా ఉంటేనే అన్నదమ్ముల హవా కొనసాగుతున్న కాలం ఇది. అలాంటిది తండ్రి ముఖ్యమంత్రిగా ఉండి.. ఆ తండ్రి ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతూ...అధికారంలో ఉన్న పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండే వ్యక్తి ప్రభావం ఏ స్థాయిలో ఉంటుంది? సాధారణ పరిస్థితుల్లో అయితే ఊహించటం పెద్ద కష్టమేమీ కాదు. ఆ నాయకుడిని మచ్చిక చేసుకోవటానికి, ప్రసన్నం చేసుకోవటానికి వ్యక్తులు, సంస్థలు పోటీపడటం సహజం.**



**నూర శ్రీనివాస్**
**91827 77011**



అధికారం లేనప్పుడూ ఆ నాయకుడికి దేశ, విదేశాల్లో అదే గౌరవం, అదే మర్యాద దక్కటం ఎలా సాధ్యం? అంటే అధికారం ఉన్నా లేకపోయినా నిరంతరం తనలో సహజసిద్ధంగా ఉన్న అధ్యయనం, కార్యశీలత, కమిట్‌మెంట్, విషయ నైపుణ్యంతోపాటు అధికారంలో ఉన్నప్పుడు తన రాష్ర్టానికి తన చొరవ, ముందుచూపుతో చేసిన పనులు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలు కారణమని చెప్పాలి. ఆ అరుదైన ఆవిష్కరణ తెలంగాణది అయితే, ఆ ఆవిష్కరణల వెనుక దాగిన కార్యశీలత కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ది. కేటీఆర్ సుదీర్ఘకాలం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో దేశ, విదేశీ సంస్థల నుంచి ఆహ్వానాలు అందాయి. అధికారంలో ఉన్నపార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కంటే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖలకు తన పనితీరుతో జాతీయ, అంతర్జాతీయ ఇమేజ్‌ను తెచ్చారనటంలో ఎవరికీ అభ్యంతరం లేదు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో ప్రైవేట్ రంగంలో 16 లక్షలకుపైగా ఉద్యోగాల కల్పన జరిగింది. పెట్టుబడులూ అదే దామాషాలో రాష్ర్టానికి వచ్చాయి. దేశ, విదేశాల్లో ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి రంగాలకు కేటీఆర్ తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్ అయ్యారు. అందువల్లే అధికారం లేకపోయినా కేటీఆర్‌కు దేశ, విదేశాల్లో అదే క్రేజీ..అదే ఇమేజ్ కొనసాగుతున్నది.

సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణను అన్నిరంగాల్లో తిరుగులేని శక్తిగా రూపొందించుకోవాలనే బలమైన లక్ష్యంతో కేసీఆర్ పాలన కొనసాగింది. తెలంగాణను బాగు చేసుకోవాలనే తపన, భవిష్యత్తును ఊహించే దార్శనికత, తెలంగాణ ప్రజల అవసరాలను అర్థం చేసుకోగలిగే మనసు, అంతకు రెట్టింపు తెలంగాణను అమితంగా ప్రేమించగలటం వల్ల కేసీఆర్ హయాం అద్భుత ఫలితాలు సాధించింది. కేసీఆర్ టీంలో ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖలను నిర్వహించిన కేటీఆర్‌కు అధికారం లేకపోయినా దేశ, విదేశాల్లో అదే గౌరవం దక్కుతుందనటానికి కేరళలోని కొచ్చిలో ఈ జనవరిలో జరిగిన 'ది ఇండస్ ఆంత్రప్రెన్యూర్స్' (టీఐఈ) సదస్సే నిదర్శనం. ఆ సదస్సులో కేటీఆర్‌ను ఐటీ మంత్రిగా సంబోధించారు. తాను 'ఐటీ శాఖ కాదు అసలు మంత్రినే కాను' అని కేటీఆర్ వారించినా నిర్వాహకులు 'మేము మాత్రం మంత్రిగానే భావిస్తాం' అని చెప్పేశారు. అలాగే దేశంలోనే అత్యుత్తమ ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో మొదటి వరుసలో నిలిచే ఐఐటీ మద్రాస్ ఏటా నిర్వహించే ఆంత్రప్రెన్యూరల్ ఫెస్టివల్ ఈ- సమ్మిట్‌లో ఇటీవలే కేటీఆర్ కీలకోపన్యాసం చేశారు. అక్కడా అదే ఆదరణ, అభిమానం.

> **ఇక లండన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ ఆటోమొబైల్ -ఇంజినీరింగ్ సర్వీసెస్ సంస్థ ప్రాగ్మాటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ యూకేలోని -వార్విక్ టెక్నాలజీ పార్క్ ఏర్పాటుచేసిన తమ నూతన కేంద్రాన్ని ప్రారంభించాలని కేటీఆర్‌ను ఆహ్వానించింది. ప్రపంచంలోనే అతి పెద్దదైన, అత్యంత విలువైన కారు బ్రాండ్ అయినా మైక్లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి ప్రముఖ ఆటో దిగ్గజాలకు ఆ సంస్థ సేవలందిస్తున్నది.**

తెలంగాణ రాష్ర్టాన్ని ఐటీ, ఇండస్ట్రీయల్ ఇన్నోవేషన్‌లో అగ్రగామిగా తీర్చిదిద్దిన ఘనత కేటీఆర్‌దని ఆ సంస్థ ఆహ్వాన పత్రంలో ముద్రించింది. బ్రిటన్‌లో జరిగే 'ఐడియాస్ ఫర్ ఇండియా-2025' సదస్సుకు అతిథిగా రావాలని 'బ్రిడ్జ్ ఇండియా' సంస్థ కేటీఆర్‌ను ఆహ్వానించింది. ఈ 30వ తేదీన లండన్‌లోని రాయల్ లాంకాస్టర్‌లో జరిగే సదస్సులో ముఖ్య వక్తగా ప్రసంగించాలని కోరింది. 2023లో కేటీఆర్ చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకున్నదని, ఆ ప్రసంగం కొత్త ఆలోచనలకు పురిగొల్పిన కారణంగానే ఈసారి కూడా తాము కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్నామని ఆ సంస్థ నిర్వాహకులు ఓపెన్‌గానే చెప్పారు. 'తెలంగాణలో ప్రభుత్వం మారినప్పటికీ కేటీఆర్‌ను ప్రత్యేకంగా ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు ఆహ్వానిస్తున్నామని బ్రిడ్జ్ ఇండియా ఫౌండర్ ప్రతీక్ దత్తానీ కేటీఆర్‌కు రాసిన లేఖలో పేర్కొనటం గమనార్హం. అలాగే వచ్చే నెల (జూన్) 20, 21వ తేదీల్లో ఇంగ్లండ్‌లో జరిగే ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ అంతర్జాతీయ సదస్సుకు హాజరుకావాలని కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సులో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో అమలుచేసిన వినూత్న విధానాలు, సాంకేతిక ఆధారిత అభివృద్ధి నమూనాల ఆచరణ అనుభవాలను వివరించాలని ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం నిర్వాహకులు కేటీఆర్‌ను కోరారు. తెలంగాణ రాష్ర్టాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చడంలో, హైదరాబాద్ అనేక అంతర్జాతీయ ఐటీ కంపెనీలను స్థాపించడంలో కేటీఆర్ చేసిన కృషి, టీ-హబ్, వీ-హబ్, టీ-వర్క్స్ వంటి వినూత్న కార్యక్రమ స్టార్టప్‌ల సృష్టిలో అనుసరించిన వైఖరిని వివరించాలని ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం కోరింది.

జాతీయ, అంతర్జాతీయ సంస్థలు కేటీఆర్‌ను ఐకానిక్‌గా చూడటం వెనుక బలమైన నేపథ్యం ఉన్నది. ఐటీ రంగంలో తెలంగాణ సాధించిన విజయగాథ. దానికి భూమిక కేసీఆర్ నాయకత్వంలో రూపొందిన టీఎస్ ఐపాస్ విధానం. వీటికితోడు 2017లో జరిగిన గ్లోబల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌లో నాటి ఐటీ శాఖ మంత్రిగా కేటీఆర్ ప్రదర్శించిన చొరవ, ఆ సమ్మిట్‌లో ఆయన వాక్పటిమకు నాటి (ప్రస్తుతం కూడా) అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ కూతురు ఇవాంకా ట్రంప్ ముగ్ధురాలయ్యారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ సతీమణి చెర్రీ, నాటి డెల్ ఈఎంసీ కరేన్ క్వింటోస్ వంటి ఎంతోమంది కేటీఆర్ విజన్‌కు ఫిదా అయ్యారు. అలా తెలంగాణ ఐటీ రంగానికి ఒక్కొక్కటిగా పడిన అడుగుల ఫలితంగా హైదరాబాద్ దేశంలోనే కాకుండా ప్రపంచ ఐటీపటంలో చిరస్థాయిగా నిలిచేలా చేసింది. ఐటీ ఉత్పత్తుల్లో తెలంగాణ సాటిలేని మేటి రికార్డును సృష్టించటం వెనుక కేటీఆర్ చోదకశక్తిగా పనిచేశారని దేశ, విదేశం గుర్తిస్తున్నది. కీర్తిస్తున్నది. ఆ కీర్తికిరిటాలనే తమకు అనుభవపాఠాలుగా చెప్పాలని ఆయనను సంస్థలు ఆహ్వానిస్తున్నాయి. అదీ తెలంగాణకు దక్కుతున్న గౌరవం.



# కేంద్ర 'గణన' ఓ ఎత్తుగడ

> **కులగణనకు కేంద్రప్రభుత్వం ఆమోదం తెలపడంతో ఇది రాహుల్‌గాంధీ సాధించిన విజయమని కాంగ్రెస్ నాయకులు సంబురపడుతున్నారు. కానీ, ప్రధాని ఎత్తుగడలను పరిశీలిస్తే అసలు విషయం బోధపడుతుంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కులగణనపైనే ప్రధానంగా ప్రచారం సాగింది. కులగణన జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేయగా.. కులం పేరుతో విడదీయడానికి ప్రయత్నిస్తున్నారని, విడిపోతే చెడిపోతామని కులగణనకు వ్యతిరేకంగా ప్రధాని మోదీ బలంగా గళం వినిపించారు. తీరా చూస్తే మహారాష్ట్రలో బీజేపీ కూటమి భారీ విజయం సాధించింది.**



**బుద్దా మురళి**

బీజేపీ మొదటినుంచి కులగణనను వ్యతిరేకిస్తూ వచ్చింది. 'హిందువులం బంధువులం' అనే ఆర్ఎస్ఎస్ నినాదం పైకి వినిపించకపోయినా.. కాంగ్రెస్, ఇతర పక్షాలు కులగణన అంశాన్ని తెరపైకి తెచ్చిన ప్రతీసారి విడిపోతే చెడిపోతామని బీజేపీ చెబుతూ వస్తున్నది. అలాంటి బీజేపీ ప్రభుత్వం హఠాత్తుగా ఈసారి జనాభా లెక్కల్లో కులగణన కూడా చేపట్టనున్నట్టు ప్రకటించడం గమనార్హం. ఈ మేరకు ఏప్రిల్ 30న జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మన దేశంలో తొలుత బీహార్‌లో కులగణన జరిగింది. తర్వాత తెలంగాణ, కర్ణాటకలో నిర్వహించారు. కర్ణాటకతోపాటు తెలంగాణలో కులగణన తప్పులతడకగా ఉందని విమర్శలు వచ్చాయి. తమ కులం జనాభాను తగ్గించారని కొన్ని సామాజికవర్గాలు ఆరోపణలు చేశాయి. అధికార పార్టీ నాయకులు సైతం కులాల లెక్కలు సరిగ్గా లేవని విమర్శించారు. ఆయా రాష్ర్టాల్లో జరిగిన కులగణన రాజకీయంగా ఉపయోగపడవచ్చేమో కానీ, అవి చట్టబద్ధం కావు. జనాభా లెక్కల సేకరణ అంశం కేంద్రం పరిధిలోనిది కావడమే అందుకు కారణం. ఆ విషయం తెలిసినా రాజకీయ కారణాలతో కొన్ని రాష్ర్టాలు కులాల లెక్కలు తీస్తూనే ఉన్నాయి.

కులగణన చేపట్టాలని భారత్ జోడో యాత్ర సమయంలో రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఇది రాహుల్ విజయమని కాంగ్రెస్ నాయకుల ప్రచారం. ఇది సమాజ్‌వాదీ పార్టీ విజయమనేది అఖిలేష్ యాదవ్ అభిప్రాయం. ఇది మన విజయమని బీహార్ పాలకుల వాదన. జనతా దళ్, లోక్ జనశక్తి, ఎన్సీపీ, డీఎంకే పార్టీలు తమ విజయమని చెప్పుకోగా, బీజేపీ మిత్రపక్షాలు జేడీయూ, ఎల్‌జేపీ (రాం విలాస్ పాశ్వాన్) పార్టీలు తమ విజయమని ప్రకటిస్తున్నాయి. కులగణన డిమాండ్ చేయడమంటే దేశ ద్రోహమేనని, దేశాన్ని కులం పేరుతో విభజించే ప్రయత్నమని మొన్నటివరకు విమర్శించిన బీజేపీ సైతం ఇది మోదీ సామాజిక విప్లవమని గొప్పగా చెప్తున్నది.

> **ఈ విజయం ఎవరిదనే విషయాన్ని పక్కనపెడితే ఇప్పటి వరకు స్వతంత్ర భారతంలో కులగణన చేయలేదనేది వాస్తవం. కులగణన వల్ల దేశంలో ఏ సామాజికవర్గం వారు ఎంత మంది ఉన్నారనే విషయం తేటతెల్లమవుతుంది. తద్వారా సామాజిక, రాజకీయరంగాల్లో ఆయా కులాలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం వద్ద లెక్కలు అందుబాటులో ఉంటాయి. అయితే, కులగణన తమ విజయమని కాంగ్రెస్ చెప్పుకొంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఐదు దశాబ్దాల పాటు అధికారంలో ఉన్నా సామాజిక న్యాయం కోసం కులగణన చేయాలనే ఆలోచన రానందుకు కూడా కాంగ్రెస్ బాధ్యత వహించాలి.**

కులగణనను అంత తీవ్రంగా వ్యతిరేకించి, చివరకు బీజేపీ నాయకులూ ఊహించని, ఆశించని విధంగా ఎలాంటి ముందస్తు ప్రచారం లేకుండా హఠాత్తుగా మోదీ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.దీని వల్ల తాత్కాలికంగా రాహుల్‌గాంధీకి క్రెడిట్ రావచ్చు. కానీ, కాంగ్రెస్ ముక్త్ భారత్ కోరుకునే మోదీ ఆ పార్టీకి ఉపయోగపడే నిర్ణయం తీసుకుంటారా? ఇక్కడే అసలు మతలబు ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్ చేతిలో ఉన్న ఏకైక ఆయుధం కులగణన. మైనారిటీ మంత్రం కూడా కాంగ్రెస్‌ను గట్టెక్కించలేకపోతున్నది. కాంగ్రెస్ ప్రస్తుతం మూడు రాష్ర్టాల్లోనే అధికారంలో ఉంది. తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలు రెండేండ్లలోపే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నాయి. తెలంగాణలో పాలన, హామీల అమలు చూసి తమను గెలిపించాలని మహారాష్ట్రలో కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేసింది. కానీ, బీజేపీకి ఊహించని మెజారిటీ వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు ప్రయోజనం కలిగించే నిర్ణయం మోదీ ఎందుకు తీసుకుంటారు? కాంగ్రెస్ చేతిలో ఉన్న చివరి ఆయుధాన్ని సైతం లాగేసుకోవడానికే మోదీ ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు.

సాధారణంగా 2025లో జనాభా లెక్కల సేకరణ ప్రారంభం కావాలి. లెక్కల సేకరణ పూర్తయిన తర్వాత అధికారికంగా ప్రకటించడానికి రెండేండ్ల సమయం తీసుకుంటారు. ఇప్పటికే ఈ ఏడాది ప్రథమార్ధం చివరికి వచ్చేశాం. ఇంకా జనాభా లెక్కల సేకరణ మొదలుకాలేదు. అంటే 2029లో జరిగే పార్లమెంట్ ఎన్నికల నాటికి జనాభా లెక్కల సేకరణ పూర్తి చేసి, అధికారికంగా ప్రకటించే అవకాశాలు తక్కువే. కులగణన చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకున్నందున ఇకపై కులగణన కోసం కాంగ్రెస్ డిమాండ్ చేయలేదు. ముందుగానే రాహుల్‌ను మోదీ కట్టడి చేసేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో ఉచిత విద్యుత్తు అంశానికి, కులగణన నిర్ణయానికి ఓ సారూప్యత ఉన్నది. 2004 ఎన్నికలకు ముందు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు ఇవ్వాలని డిమాండ్ చేయగా, ఉచిత విద్యుత్తు ఇస్తే కరెంట్ తీగలు బట్టలు ఆరేసుకోవడానికి పనికొస్తాయని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయాక టీడీపీ తొలి సమావేశంలోనే తాము మళ్లీ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్తు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. సంస్కరణలవాది అని బాబును ఆకాశానికెత్తిన మీడియా సైతం ఏంటీ ఈ యూటర్న్ అని విమర్శించింది. ఈ హామీ అసలు ఉద్దేశం ఏమిటనేది పార్టీ నేతలకు చంద్రబాబు వివరించారు. 'మనం ఉచిత విద్యుత్తు సాధ్యం కాదని వాదించినంతకాలం అది కాంగ్రెస్‌కు మైలేజీగా మారుతుంది. వచ్చే ఎన్నికల్లో సైతం ఇదే ప్రధాన అంశమైతే మనకు ఇబ్బంది. యూటర్న్ అని మీడియా చెప్పినా ఫర్వాలేదు. మేం కూడా ఉచిత విద్యుత్తు ఇస్తామని ప్రకటిస్తే ఆ అంశం ఎన్నికల్లో ప్రధానాంశం కాకుండాపోతుంది. మనకు కావలసింది అదే' అని చంద్రబాబు పార్టీ నేతలతో చెప్పారు. ఇప్పుడు మోదీ సరిగ్గా అదే చేశారు.

# కాంగ్రెస్ కుట్రలో కాళేశ్వరం

**ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర పాలకులు తెలంగాణపై చేసిన కుట్రలు మళ్లీ పదునెక్కుతున్నాయి. నదీజలాలు తెలంగాణకు దక్కకుండా చేసే ప్రణాళికలు కండ్లముందే చకచకా సాగిపోతున్నాయి. ప్రధాని మోదీ-ఏపీ సీఎం చంద్రబాబు-తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి త్రయం మన వేలుతో మన కన్నునే పొడిచే వ్యూహాలను గుట్టుగా అమలుచేస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం భారీ వ్యయంతో చేపట్టిన గోదావరి- బనకచర్ల లింక్ ప్రాజెక్టు అందుకు నిలువెత్తు నిదర్శనం. వరద జలాల మాటున తెలంగాణకు జీవదాయిని ప్రాణహిత జలాలను కొల్లగొట్టడమే ఆ ప్రాజెక్టు అంతిమలక్ష్యం. అందులో భాగంగానే తెలంగాణ జీవదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్యప్రచారం. కమిషన్ల విచారణ.. ఎన్డీఎస్‌ఏ నివేదికల పేరిట నిర్వీర్యం చేయడం. తెలంగాణ సోయితోని ఆలోచిస్తే తప్ప అంతుచిక్కదీ కుతంత్రం.**



**గోసుల శ్రీనివాస్ యాదవ్**
**98498 16817**



గోదావరిలో ప్రధానంగా ప్రాణహిత, ఇంద్రావతి నుంచే అధిక ప్రవాహాలు ఉంటాయనేది గణాంకాలే చెప్తాయి. ఆ రెండు ప్రధాన ఉప నదులపై ప్రాజెక్టులు నిర్మిస్తే తెలంగాణ బీడు భూములను గోదారమ్మ పావనం చేసేది. కానీ ఉమ్మడి రాష్ట్రంలో ఆరు దశాబ్దాల పాటు ప్రభుత్వాల తీరు అందుకు భిన్నం. అదొక కుతంత్రం. ఎక్కడా ఏ చిన్న ఆటంకం లేకుంట, ఒక చుక్క తెలంగాణ గడ్డపై నిలవకుండా ధవళేశ్వరం దాకా వినియోగానికి సంకల్పించి, అప్పటికే ఒప్పందాలు పూర్తయి అంతర్రాష్ట్ర సమస్యలు కూడా పెద్దగా లేని తెలంగాణ చారిత్రక ప్రాజెక్టుల గొంతు సైతం నులిమారు.

350 టీఎంసీల వినియోగానికి రూపకల్పన చేసిన శ్రీరాంసాగర్‌నూ కుదించి, ఎందుకూ కొరగాకుండా చేశారు. 300 టీఎంసీల వినియోగానికి ప్రతిపాదించిన ఇచ్చంపల్లి, 100 టీఎంసీలతో ప్రతిపాదించిన కంతనపల్లి ప్రాజెక్టులకు పాతరేశారు. తెలంగాణవాదుల అలుపెరుగని పోరాటాలకు కంటితుడుపుగా పలు ప్రాజెక్టులను చేపట్టారు. అవీ నీటి లభ్యత లేనిచోట. సూటిగా చెప్పాలంటే పేరుకే ప్రాజెక్టులు తప్ప వాటితో తెలంగాణకు దక్కిన ఫలితం శూన్యం. తెలంగాణ ఏర్పడేనాటికి గోదావరి జలాల్లో తెలంగాణ నికరంగా 100 టీఎంసీలు వాడుకున్న దాఖలాలు లేవంటే కుట్రను అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ ఉద్యమ నేతగా కేసీఆర్ ఆ నీటి కుట్రలపై గర్జించారు. కుటిల పన్నాగాల గురించి తెలంగాణ సమాజానికి బోధించారు. అందుకే స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత అత్యంత ప్రాధాన్యం కలిగిన ప్రాణహిత జలాలను ఒడిసిపట్టడమే ప్రధాన లక్ష్యంగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. ఇంద్రావతి జలాల వినియోగానికి సమ్మక్కసాగర్, సీతమ్మసాగర్ బరాజ్‌కు శ్రీకా రం చుట్టారు. సూటిగా చెప్పాలంటే ప్రాణహిత, ఇంద్రావతి నదుల నీటిని ఒడిసిపట్టి, ఎగువన నీళ్లు లేని గోదావరి ప్రాజెక్టులకు తరలించి తెలంగాణను పంటలతో పచ్చగా మార్చే లక్ష్యంతో ముందుకుసాగారు.

ఒక్క కాళేశ్వరం అందుబాటులోకి రావడం వల్ల తెలంగాణలోని గోదావరి ముఖచిత్రం మారిపోయిది. ఈ ఒక్క ప్రాజెక్టు ద్వారానే గోదావరిలో మన 954 టీఎంసీల్లో 450 టీఎంసీలకు పైగా వినియోగించుకునే స్థాయికి తెలంగాణకు చేరుకుంది. ఆ ఫలాలన్నీ అనుభవంలోనే ఉన్నాయి. తెలంగాణలో మన నీళ్లు మనకు దక్కించుకునేందుకు ప్రాజెక్టులు కడుతుంటే తట్టుకోలేని ప్రత్యర్థులు చేసిన పన్నాగాలు తక్కువ కాదు. తెలంగాణలోని తమ తాబేదార్లతో అడ్డగోలు ఆరోపణలు చేయించారు. అందులోనివే కాస్ట్ బెనిఫిట్ అనాలసిస్ట్‌లు.. విద్యుత్తు బిల్లుల భారాలు.. ఆర్థికభారాలు.. ప్రజలపై భారాలు భూకంపాల ప్రమాదాలు. అయినా కేసీఆర్ నాయకత్వం ఆ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పకొట్టింది. ఏపీ ఇప్పుడు కొత్త కుట్రలకు తెరలేపింది. మళ్లీ మన వేళ్లతో మన కండ్లే పొడిపించే పన్నాగాలను అమలుచేస్తున్నది. కేంద్రం అండతో, తెలంగాణలోని తాబేదారి నాయకత్వం సహకారంతో కల్పతరువు కాళేశ్వరం ప్రాజెక్టును ఛిద్రం చేయాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్నది. మేడిగడ్డలో తలెత్తిన చిన్నపాటి సాంకేతిక లోపాన్ని సాకు చూపుతూ ప్రాణహిత జలాలను తెలంగాణకు దక్కకుండా చేసే ప్రణాళికలను వేగంగా ముందుకు తీసుకుపోతున్నది. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టే అందుకు నిదర్శనం.

బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి గోదావరిలో 1,486 టీఎంసీలను కేటాయించింది. అందులో తెలంగాణ ప్రాజెక్టులకు 968 టీఎంసీలు. ఏపీ వాటా 518 టీఎంసీలు. కానీ, ఏపీ ప్రభుత్వం ఇప్పటికే తన వాటా పరిమితికి మించి దాదాపు 776 టీఎంసీలను వినియోగించుకునేందుకు అనుమతులు లేకుండా పలు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది. ఇప్పుడు కొత్తగా రోజుకు 2 టీఎంసీల చొప్పున మొత్తంగా 200 టీఎంసీల వరద జలాలను తరలించేందుకు గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమైంది. పేరుకే ఇది 200 టీఎంసీలు కానీ, ఆచరణలో మాత్రం 350 టీఎంసీలకు పైనే.

> **గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం పనులను ఏపీ సర్కార్ నిర్వహిస్తున్నది. పెన్నా బేసిన్‌లో ఇప్పటికే ఏపీ సోమశిల, కండలేరు, అవులపల్లి తదితర అనేక రిజర్వాయర్లను నిర్మించింది. పోతిరెడ్డిపాడు ద్వారా ఆయా రిజర్వాయర్లకు కృష్ణా జలాలను ఏటా అక్రమంగా మళ్లిస్తూనే ఉన్నది. ఇప్పుడు గోదావరి జలాలను కూడా ఆ మేరకు పెన్నా బేసిన్‌కు తరలించేందుకు ఏపీ వేగంగా పావులు కదుపుతున్నది. వరద జలాల మాటున కృష్ణాలో చేస్తున్న జలదోపిడీనే రాబోయే రోజుల్లో గోదావరిలోనూ పునరావృతం కానుందనేది మనం తెలుసుకోవాల్సిన సత్యం.**

గోదావరి నదీ పరీవాహక ప్రాంతాన్ని మొత్తంగా 12 సబ్ బేసిన్‌లుగా విభజించారు. అందులో 8 సబ్ బేసిన్ల నుంచి గోదావరికి వచ్చే జలాలు 31.95 శాతం. ఇక జీ9లోని ఒక్క ప్రాణహిత సబ్‌బేసిన్ నుంచే 26 శాతం జలాలు గోదావరిలో చేరుతాయి. జీ10 సబ్‌బేసిన్ అయిన లోయర్ గోదావరి అంటే ఎస్సారెస్పీ నుంచి పోలవరం వరకు మధ్య గోదావరిలో వచ్చిచేరే జలాలు 7.19శాతం, జీ11 సబ్ బేసిన్‌లోని ఇంద్రావతి నుంచి 22.93 శాతం జలాలు గోదావరికి వస్తాయి. సూటిగా చెప్పాలంటే గోదావరి నీటిలభ్యతలో ప్రాణహిత, ఇంద్రావతి జలాలే 48.93 శాతం.

ప్రాణహితలో ఏడాదిలో 300 రోజుల పాటు కనీస వరద ప్రవాహాలు కొనసాగుతుంటాయి. ప్రాణహిత జలాల భరోసాతోనే ఏపీ సర్కారు అంత భారీ వ్యయంతో జీబీ లింక్‌కు పూనుకున్నది. ఏపీ ప్రణాళికలన్నింటికీ, గోదావరి జలాల తరలింపునకు అడ్డంకిగా మారింది కాళేశ్వరం ప్రాజెక్టు. కాబట్టి మేడిగడ్డ బరాజ్‌లో తలెత్తిన చిన్నపాటి సాంకేతిక లోపాన్ని చూపి ఏపీ చేతిలో కీలుబొమ్మగా మారిన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర నాయకత్వం.. కాళేశ్వరంపై విషప్రచారం చేస్తున్నది. జీబీ లింక్ తెలంగాణను మళ్లీ ఎడారిగా మార్చనున్నది. పోతిరెడ్డిపాడు అందుకు సజీవ సాక్ష్యం. పోతిరెడ్డిపాడు విషయంలో తెలంగాణ నేడు అచేతనంగా ఉండాల్సిన దుస్థితి నెలకొన్నది. రేపటి రోజున జీబీ లింక్ ప్రాజెక్టుతోనూ అదే పునరావృతం కానున్నది. ఇప్పటికైనా తెలంగాణ సమాజం ఈ కుట్రలను తెలుసుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు పరిరక్షణకు నడుం కట్టాలి. జలహక్కుల సాధనకు పునరంకితమవ్వాలి.

**(వ్యాసకర్త: డైరెక్టర్ టీ-కేసీఆర్ సెంటర్)**







## ● ఆహ్వానం

మే 28వ తేదీ బుధవారం సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి సందర్భంగా డాక్టర్ అనుమాండ్ల భూమయ్య, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్‌లకు పురస్కార ప్రదానోత్సవం జరుగనున్నది. ముఖ్య అతిథిగా జూపల్లి కృష్ణారావు, పురస్కార ప్రదాన మాన్యులుగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సభాధ్యక్షులుగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, విశిష్ట అతిథిగా వరప్రసాదరెడ్డి హాజరుకానున్నారు. నిర్వహణ డాక్టర్ జె.చెన్నయ్య. అందరికీ ఆహ్వానం.

**- డాక్టర్ సురవరం పుష్పలతారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్టు**

# శాంతి అంటూనే దాడులు!



**ఓవైపు శాంతి చర్చలు జరుపుతూనే, మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా దాడులు చేస్తున్నది. గత మూడు రోజుల్లో 900కు పైగా డ్రోన్లతో మాపై విరుచుకుపడింది. కొత్త ఆపరేషన్లకూ సన్నద్ధమవుతున్నట్టు మాకు సమాచారమున్నది. ఇస్తాంబుల్‌లో ఇటీవల జరిగిన శాంతి చర్చల్లోని నియమాలను పుతిన్ గౌరవించాలి.**

**- వలోదిమిర్ జెలెన్‌స్కీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు**